# 32. ఏదో జరిగే ఉంటుంది!

'అయితే ఉన్నపళంగా ఇంత అర్జంటుగా నేనెందుకు పిలిపించానో అడగవన్నమాట"

"అడగందే నువ్వు చెప్పవన్నమాట!" అని అతన్నింకా అల్లరిపెట్టబోయి, మరింతగా మబ్బులు ముసురుకుంటున్న ప్రసాద్ మొహంలోకి చూసి శేఖర్ సీరియస్‌నెస్ తెచ్చుకుని మళ్ళీ అన్నాడు.

"సారీ రా! నీ మటుకు నువ్వు చెప్పడంకాక ఎంత ఫ్రెండువయినా నామటుకు నేను తెలుసుకుంటేనే నాకు బాగుంటుంది. ఈ రెండ్రోజులూ వెతికి చూసినా వేలెత్తి చూపించవలసిన వర్రీ నాకేం కనపళ్లేదు. మిడిల్ ఏజ్‌లో పడ్డాంకదా ఏదేదో అనుకున్నాను. అయినా ప్రతిదానికీ బాధపడే లక్షణం నీకింకాపోలేదన్నమాట. ఎలాగావచ్చానుకదా, వినకతప్పుతుందా, నీగోడేదో వినిపించు"

శేఖర్ ధోరణి ప్రసాద్‌కేం నచ్చలేదు.

"అంత ఇబ్బందిపడి వినక్కర్లేదులే..... ఇంకో గంటకి ఎక్స్‌ప్రెస్ వుంది. ఇన్నాళ్లకివచ్చి మొహం చూపించావ్ అంతే చాలు.."

"సారీ అని చెప్పేనుగా.... నా మాట తీరే అంత. అనవసరంగా హర్టయిపోకు. ఇంకో రెండ్రోజులు లీవు ఎక్స్‌టెండ్ చేసినా మా బాస్ ఏం అనడు. విమలగారు నన్ను మేపడానికి విసుక్కోదు. ఏదైనా లైట్‌గా తీసుకోవడం నాకు అలవాటైపోయిందిమరి. మరోసారి సారీ. నీ పేతటిక్ స్టోరీ ఇకనైనా వినిపించు"

ఇద్దరూ పార్కులో ఎవరూ లేనిచోట ఓ మూల కూచుని సిగరెట్లు వెలిగించుకున్నాక తనకొచ్చిన చికాకు ఎలాంటిదో ప్రసాద్ వివరించాడు.

ప్రసాద్ పెళ్లాం విమలకి వాళ్ల మేనత్త సావిత్రీ, ఆవిడ మొగుడు రామనాధం తప్ప మరెవరూలేరు. చిన్నప్పట్నుంచీ ఆ అమ్మాయిని వాళ్లిద్దరూ ఎంతో ప్రేమతో పెంచి పెద్దదాన్ని చేశారుట. వాళ్లపిల్లలతో సరిసమానంగా చదివించారుట. పెద్ద కట్నం ఇచ్చి బ్యాంకు ఉద్యోగి ప్రసాద్‌కిచ్చి పెళ్లిచేశారు. ఇదంతా జరిగి ఓ పుష్కరందాటి ఉంటుంది.

'సావిత్రత్తయితే మానాన్నకి స్వయంగా చెల్లెలు. ఆవిడ అభిమానపడడం సహజమే. పైవాడు ఆ రామనాధం మామకేం పట్టింది చెప్పండి! చనువుతో అత్త నన్నొకమాట అంటే చాలు మావయ్య ఇంతెత్తున లేచేవాడు. తల్లీదండ్రీలేనిదాన్నని నన్ను ప్రత్యేకంగా చూసే వాడు. నాన్న నా పేరున ఉంచిందంతా అణాపైసలతో అప్పచెప్పడమేకాక అంతకు మరింత తన చేతిది ఖర్చు పెట్టేడు.' ఇలా రామనాధం మంచితనం గురించి ఎన్ని సార్లు చెప్పినా విమలకి తనివి తీరేదికాదు.

ఒకరు చెప్పనక్కర్లేదు. అతనెంత సహృదయుడో వాళ్ళపెళ్లికి హాజరయిన శేఖర్‌కి ఇంకా గుర్తుండనే వుంది. ఆ పెళ్లిలో ప్రసాద్‌వాళ్ల వాళ్లు ఎంతగా పేచీ పెట్టేరో వాళ్లక్క సుందరమ్మ ఎంతటి ఆడంబరం ప్రదర్శించిందో మగపెళ్లివారిని తృప్తిపరచడానికి విమల మేనత్త తోపాటు రామనాధం

ఎన్ని తంటాలుపడ్డాడో ఇప్పుడు కొత్తగా ఒకరు వివరించనక్కర్లేదు కూడా.

అదేపనిగా వాళ్లవాళ్లని పొగుడుతూవుంటే విని విని ప్రసాద్‌కి విసుగెత్తిపోయిందిట. ఇన్నేళ్లు గడిచిపోయినాకూడా రోజుకోసారైనా వాళ్లగొప్పదనం ఎత్తి చూపిస్తుంటే ప్రసాద్‌కి ఒళ్లుమండిపోయేదిట. రెండేళ్ళకిందట ఇదే ప్రస్తావనకి వస్తే శేఖర్ ఆ ఊరొచ్చినప్పుడు విమలతో ఆ మాట అన్నాడు కూడా.....

"వాడికి ఇష్టంలేనప్పుడు ఎందుకమ్మా విమలా అస్తమానూ ఆ రామనాథం ఊసుఎత్తుతావ్?"

"ఎందుకో చెప్పమన్నారా శేఖర్? మా అమ్మా నాన్నా ఎలా ఉంటారో నేను ఎప్పుడూ ఎరగను. రెండేళ్ళి మా మేనత్తా పోయింది. కాని అదెక్కడి సంబంధమో మా రామనాథం మామయ్యకి అప్పుడూ ఇప్పుడూ నేనంటే పంచప్రాణాలూను" అన్నదామె.

"అయితే ఏమంటావ్? ఇప్పుడు నీ పిల్లలకే ఏ పదో పన్నెండో వచ్చివుంటాయి. అతను మీ ఇంటికొస్తే ఓ పూట భోజనంపెట్టి ఆదరించి పంపించడంకంటే ఏం చెయ్యగలవ్?" అన్నాడు శేఖర్.

"అదే ఆలోచిస్తున్నాను. అందుకే దుఃఖపడుతున్నాను" విమల తన విషాదహేతువేమిటో అన్నలాంటి శేఖర్‌కి అమూలాగ్రం చెప్పుకుంది.

తన భారానికిమించి విమలని ఎమ్మే చదవించారుట. వాళ్లు అక్కడితో సరిపెట్టుకోక తమ తాహతుకు మించిన బాగా, స్థితిపరుల సంబంధం తెచ్చి పెళ్లిచేశారుట. దానా దీనా చితికిపోయారట బాగా, వాళ్ళ కడుపున పుట్టిన మగపిల్లలిద్దరూ స్వార్థపరులై తండ్రిని ఆదుకోని పద్ధతుల్లో స్థిరపడిపోయారుట.

"మావయ్య మానధనుడు. ఒక్క ముక్క తనంతగా బయటపడడు. అత్తయ్య ఉన్నన్నాళ్లూ ఉత్తరమ్ముక్కయినా రాసేది. ఇప్పుడు అదీ లేదు. కానీ నాకు తెలీకుండా ఉంటుందా? ఉన్న ఒక్క ఆడపిల్లకీ పెళ్లిచెయ్యలేకపోయాడు. అదో గ్రాడ్యుయేట్ అయినా కాకుండా పోయింది. పాతికేళ్లు వచ్చేశాయి. నాకింత వెలుగు ప్రసాదించి ఆహుతి అయిపోయారు. ఏంచదువుకున్నా నన్ను వీళ్లు ఉద్యోగం చెయ్యనిచ్చారుకాదు. అలా కుదరదని పెళ్లిముందే కండిషన్ పెట్టారు. నా చేతకానితనానికీ, ప్రత్యుపకారం చెయ్యలేని దుస్థితికీ వాళ్ళని తలుచుకుని కళ్లొత్తుకోడానికేనా నాకు స్వతంత్రం లేదా!" శేఖర్ పైకి ఏమీ అనలేదుగాని సెల్ఫ్ పిటీ అంటే అతనికి గొప్ప చికాకు. ఉద్యోగం చెయ్యడానికి వీల్లేదంటే ఒప్పుకునే, విమల పెళ్లిచేసుకుని ఉండొచ్చు. అప్పుడైతే అత్తా మావా ఆరళ్ళూ ఉండేవి. అయిదేళ్ళి ఆఖరి ఆడపడుచు పెళ్ళిచేసి ఆ బాధ్యతా తీర్చుకున్నారు.

తన పిల్లలు హైస్కూలు చదువుకి ఎదిగేరు. ఇప్పుడైనా తనంత తాను ఉద్యోగంచేసే ప్రయత్నం ఎందుకు చెయ్యదు! మొగుణ్ణెప్పుడైనా గట్టిగా అడిగిచూసిందా! ఎంత చనువున్నా ఇలాంటి ఆంతరంగిక విషయాలు విమలని అడగలేకపోయాడు శేఖర్.

అందుకనే తనని ప్రత్యేకించి అక్కడికి రప్పించాడంటే విమల విషయమే అయివుంటుందని శేఖర్ ముందుగానే ఊహించాడు 'వాడి నోటితో వాణ్ణే చెప్పనీ' అని ఈ రెండ్రోజులూ ఊరుకున్నాడు.

"ఇప్పుడైనా ఉద్యోగంచేసి తీరతాననీ, వచ్చే జీతంతో కొంతైనా రామనాథం ఫ్యామిలీని ఆదుకుంటాననీ" విమల పట్టుపట్టి ఉండాలి. విమలతో తనకి ఏకాంతం చిక్కకుండా ఈ రెండ్రోజులూ ప్రసాద్ జాగ్రత్తపడ్డాడంటే తనావిణ్ణి సపోర్ట్ చేస్తానని ఊహించే ఉండాలి.

'ఆహా! అదా సంగతి!' అనుకున్నాడు శేఖర్.

'దానికి సంబంధించిందే గాని, అదేదీ కాదని ప్రసాద్,' నోట విని తెల్లబోయాడు!

తనూ, తన బ్యాంకుపనీ అంతవరకే లీనమయి పోయాడు ప్రసాద్ ఇన్నేళ్లూ, ఇంట్లోనే ఇలాంటి ఘోరానికి అవకాశం ఉంటుందని అక్క సుందరమ్మ సూచించే దాకా కనుక్కోలేకపోయాడు.

ఆ మధ్య విమల మెళ్లోని అయిదు తులాల బంగారు గొలుసు మాయమయితే దొంగతనం జరిగిందనుకుని పోలీసు రిపోర్టు ఇచ్చి ఊరుకున్నారు.

ఏం జరిగివుంటుందో సుందరమ్మ వచ్చి బయట పెడితేగాని తెలియలేదు.

చుట్టపుచూపుగా వచ్చిన ఆ ఇల్లాలు గుట్టు బయట పెట్టింది కూపీలాగి, విమలే దాన్ని రహస్యంగా అమ్మించి ఆ సొమ్ము రామనాథానికి పంపించిందిట. వాళ్లమ్మాయి పెళ్లికి కొంతైనా సహాయంగా.

'ఇదంతా నిజమేనా?' అని నిలదీశారుట అక్కా,.తమ్ముడూ.

'నిజమే, ఇది మా అమ్మ నగ అని నా పెళ్లినాడు మా మేనత్త బాల తొడుగుగా పెట్టింది. ఈనాడు వాళ్లు నానా బాధలూ పడుతూవుంటే నాదైన సొమ్ములోంచి ఆ మాత్రం పెట్టుకుంటే తప్పా?"

ఆ ఎదురు జవాబుకి ప్రసాద్ విమల చెంప చెళ్లుమనిపించునేమో కాని మరదలికి అంత తక్కువ శిక్ష పడడం సుందరమ్మకి సుతరామూ నచ్చలేదు. చెయ్యిపట్టుకుని తమ్ముణ్ణి ఇవతలి తీసుకొచ్చింది.

"ఇప్పుడా రామనాథంగాడికి అరవై అనుకుందాం. నీ పెళ్లానికిప్పుడు ముప్పై అయిదూ, అవునా? పెళ్లినాటికి దాని వయసెంతా, ఇరవై. అప్పుడు వాడికో నలభై అయిదూ, అవునా? అంటే ఏమిటి, నువ్వే ఆలోచించుకో" అన్నది సుందరమ్మ.

ఈ లెక్కల తికమకలవెనకవున్న అంతరార్థమేమిటో బ్యాంకులో సీనియర్ ఎకౌంటెంటుగా పనిచేస్తున్నా ప్రసాద్ తలకెక్కలేదు.

"సొంత మేనత్త అన్నది అభిమానపడితే అర్థముంది. పై వాడయిన రామనాథంగాడు దీన్నింత ప్రేమగా చూసుకున్నాడంటే - ఇదిప్పటికీ వాడంటే ఇంతగా పడిచస్తూందంటే ఎన్నేళ్లపాటు వీళ్లిద్దరిమధ్యా ఏం జరిగిఉంటుందో ఆ మాత్రం ఊహించలేమా!"

"ఆమాత్రం నాసొమ్ము నేను పెట్టుకుంటే తప్పా అనీ తన మొహంమీదే నిలదీసింది. తప్పే కాకపోతే చెప్పి ఎందుకుచేసింది కాదంట? బొంక నేర్చినమ్మ ఇంకోటి ముందే నేర్చిందంటే అందులో ఆశ్చర్యమేముంది!"

సుందరమ్మ ఆఖరిమాటగా ఇలా చెప్పిందిట.

"తమ్ముడూ! అదంటే గిట్టక నేనేదో చెబుతున్నాననుకోకు. పిల్లలంటే పుట్టలేదుగాని నాకూ నెత్తిమీద పెట్టుకునే మొగుడున్నాడు. ఆ పల్లెటూళ్లో సగం భూములు మావే. మూడొంతుల ఇళ్లు మావే. నా కాపరం ఏదో నాశనమైపోయి పచ్చగా సాగుతున్న మీ కాపరంలో చిచ్చు పెట్టడానికి నేనేం పనికట్టుకురాలేదు. అన్నీ తెలిసిన వాడివి. నువ్వే మంచీ చెడ్డా ఆలోచించుకుని ఏం జరిగివుంటుందో నిడివి మీద కనుక్కో. ఎప్పుడు జరిగినా పాపం పాపమే. అదేదో తెలుసుకోకుండా ఊరుకుంటే మరింత పాపం మూటకట్టుకున్నట్టవుతుంది" అని అన్ని సమిధలూ వేసి మరీ ఇల్లు కదిలిందిట!

ఇవన్నీ వివరంగా చెప్పి ప్రసాద్ శేఖర్ రెండు చేతులూ పట్టుకుని అన్నాడు. " ఆ మాటవిన్న క్షణం నుంచీ కంటి మీద కునుకులేదు. నోటికింత ముద్దలేదు. ఏం చేస్తావో ఎలా కనుక్కుంటావో ప్రాణ స్నేహితుడివని ఇలాంటి క్లిష్టసమస్య నీమీద ఉంచుతున్నాను. ఓ పక్క మీద పడుకోడంకాదు. దాని పక్క చూడ్డానికి కూడా అసహ్యంగా వుంది. ఆ రామనాధంగాడు నీకు బాగా దూరపుచుట్టం అని నాకు తెలుసు. ఎంత డబ్బు ఖర్చయినా ఎంత శ్రమయినా వెనుకాడకు. జరిగిందేమై ఉంటుందో ఆధారాలతో సహా తేల్చాలి. ఇంతకీ..."

ప్రసాద్ చెబుతున్నదేదో ఫాలో అవడానికి శేఖర్ మనసు సిద్ధంగా లేదు. సుందరమ్మ వేసిన అభాండం తలుచుకుంటే వెగటు పుట్టుకొస్తోంది అతనికి. ప్రసాద్ తల్లిదండ్రులూ ఉండేవారు. ఏవో మూఢాచారాలు పట్టుకు వేళ్లాడేవారుగాని ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టలేదు. పదిహేనేళ్లకి పైగా కాపరం చేస్తున్న మరదలి కాపరంలో నీళ్లు పొయ్యడానికి సిద్ధపడింది సుందరమ్మ. ఆవిడ మొగుడు భాగ్యవంతుడనేమాట నిజమేగాని డైరెక్ట్‌గా సానిపాపల్ని ఇంటికి తెచ్చి భార్య ఎదుటే శృంగారం నడిపిన గ్రంథసాంగుడతడు. ఆ విధంగా రగిలిన గుండెతో మరొకరి కొంపకూల్చడంలో సుందరమ్మ లాంటివాళ్లు తృప్తిపడడంతో ఆశ్చర్యంలేదు. ఈ ప్రసాద్ బుద్ధి ఏ గడ్డితిన్నట్టు? హాస్టల్లో చదువుకున్న రోజుల్లో శేఖరూ ప్రసాదూ మెరకవీధి సరుకుకి కక్కుర్తిపడి ఎన్నో కోర్సుల పెన్సిలిన్ ఇంజక్షన్లు పుచ్చుకున్న సంగతి అప్పుడే మరిచిపోయాడా? పెళ్లికిముందే పెడదారులు పట్టిన రికార్డువున్న ప్రసాద్ ఓ శాడిస్టు హితబోధతో కట్టుకున్న పెళ్లాం శీలాన్నే శంకించే నీచ స్థితికి దిగేడు. వీడిలాంటి వాడికెలా బుద్ధి చెప్పడం?

"ఏంరా అంతావిని ఏం విన్నట్టు ఎంత సేపైనా మాటడవేం?

"అదే ఆలోచిస్తున్నాను"

"మా అక్క చెప్పినట్టు జరగలేదంటావా?"

"ఎందుకు జరగలేదూ? ఏదో ఒకటి జరిగే ఉంటుంది. నే వెళ్లి కనుక్కుని నీకు రాస్తాగా!" అన్నాడతను.

శేఖర్ సానుభూతి అంతా విమలమీదే ఉందనీ, ఆవిణ్ణి రక్షించే మార్గం కోసం బుర్రబద్దలు కొట్టుకున్నాడనీ ప్రసాద్ కలలోకూడా అనుకోలేదు. అతన్ని కౌగిలించుకున్నంత పని చేశాడు. కళ్లనీళ్లతో

ఇలా అన్నాడు.

"ఇప్పుడు నాకెంతో బలంవచ్చింది. నా మనసు విరిగిపోయింది. ఇక విడాకులేగతి. పిల్లలేమౌతారని ఆలోచించకు. ఏదో ఒక రుజువు కావాలి. ఏదో ఫోటోనో ఉత్తరమో ఏదోఒకటి. ఎలా కనుక్కుంటావో నన్నెలా ఒడ్డునపడేస్తావో నీదే భారం. మళ్లీచెబుతున్నాను. ఖర్చుకి వెనకాడకు"

ఓ నెల్లాళ్లతర్వాత ప్రసాద్‌కి శేఖర్ నుంచి ఉత్తరం వచ్చింది.

"డియర్ ప్రసాద్.

అన్ని అదనపు సౌకర్యాలతోపాటు మనకిప్పుడు పెద్ద పెద్ద పట్నాల్లో ఎన్నో ఆధునిక పరికరాలుగల డిటెక్టివ్ ఏజన్సీలు లభ్యమౌతున్నాయి. ఎంత వెనక్కైనా వెళ్లి ఎప్పటి భోగట్టాలైనా తవ్వి తీయడంలో వాళ్లకున్న శాస్త్రీయ పద్ధతులు గమనిస్తే మతిపోతుంది. మనం చదువుకున్న రోజుల్లోని కృష్ణలీలలు రికార్డు కాకపోవడం మన అదృష్టమనుకో. ఇంతకీ ఎవరైనా దానికి పూనుకుంటే మనమూ ఇబ్బందుల్లో పడ్డట్టే.

మనం స్నేహితులమేకాక దూరపు బంధవులం అవబట్టి, ఎదురుచూసిన గతం రుజువుకాలేదుగాని, నమ్మలేని నిజాలు కొన్ని బయటపడ్డాయి. ఓ పాత ఫోటో స్టూడియోలో మనకి తెలిసినవాళ్లదే ఓ ఫోటో బయటపడింది. మీ ఇంటి టైలరు రామునాయుడు గుర్తున్నాడా, పెద్ద పెద్ద మీసాలూ మొహంనిండా స్ఫోటకం మచ్చలూవాడూ, లాస్టియర్ కలరానో, ఏదోవచ్చి పోయాడన్నాడు.

వాడి ఒళ్లో పడుకుని మీ సుందరమ్మక్క తీయించుకున్న ఫోటో బయటపడింది. మీ అక్క పెళ్ళైన మూడేళ్ల తర్వాత అది తీయించుకున్నట్టు డేటుకూడా ఉంది. ఐదువేలకి బేరమాడి ఆ నెగిటివ్ సంపాదించాను. 'ఏదో జరిగే ఉంటుంది' అనే దానికి ఇది రుజువుకదా!

ఒరే ప్రసాద్, ఒకటనిపిస్తోంది. నీతి అనేది మనసుకి సంబంధించింది. గతం అనేది మళ్లీ రానిది. కెలకడం అనేది కోడికీ, తవ్వడం అనేది పందికొక్కుకీ వదిలేసి, మనసున్న మనుషులుగా వర్తమానంలో జీవించడమే మనకి క్షేమం. ఏమంటావ్? నీ, శేఖర్."

★